www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 16 నవంబర్ 2022 5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

'జలజీవన్'తో సురక్షితమైన తాగునీరు

ప్రజాశక్తి -అయినవిల్లి

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగు నీరు అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని సర్పంచ్ కుడిపూడి శాంతవతి అన్నారు. మంగళవారం జలజీవన్ మిషన్ కోనసీమ సేవా మండలి డివిజన్ కోఆర్డినేటర్ బి.చందు ఆధ్వర్యంలో సిరిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షపు నీటి ఒడిసి పదడం -నీటి వనరులు సంరక్షించుకుందాం,పరిసరాల పరిశుభ్రత పై ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో కార్యదర్శి ఎవివి రమణ, స్థానిక ఎంపిటిసి సభ్యులు యాళ్ల పండు, వైసిపి నాయకులు కుడిపూడి విద్యాసాగర్, ఎఎన్ఎం సుచరిత, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సిరిపల్లిలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

రైతులకు మద్దతు ధర అందజేతకు కృషి

- జెడ్‌పి సమావేశంలో మంత్రి వేణు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రైతుల పంటకు మద్దతుధర అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని బిసి సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం కాకినాడ జెడ్‌పి కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జెడ్‌పి ఛైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి వేణుతోపాటు మరో మంత్రి మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కాకినాడ ఎంపీ వంగా గీత తదితరులు పాల్గొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ ధాన్యం సేకరణ, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు, రహదారులు-భవనాలు, గిరిజన ప్రాంతాల సమస్యలు-పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. జెడ్‌పిటిసిలు ఆయా ప్రాంతాలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించగా.. అధికారులు సమాధానమిచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ ఇ-క్రాప్ బుకింగ్, ఇ-కెవైసి విధానాలను తీసుకొచ్చి అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుపుతున్నట్లు తెలిపారు.



కాకినాడ జెడ్‌పి కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి వేణు, పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తదితరులు

ఏప్రిల్ నాటికి రహదారుల పనుల పూర్తి

రహదారులు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి రహదారులను పనులను వచ్చే మార్చి, ఏప్రిల్ నాటికి పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతాల స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన రహదారుల పనులను సత్వరం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సిలు చిక్కాల రామచంద్రరావు, ఐ.వెంకటేశ్వర రావు, అనపర్తి, జగ్గంపేట, రాజోలు, కాకినాడ రూరల్, రాజానగరం ఎంఎల్‌ఎలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జ్యోతుల చంటిబాబు, రాపాక వరప్రసాద్, కురసాల కన్నబాబు, జక్కంపూడి రాజా పాల్గొన్నారు.

రైతుల నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి ఎంఎల్‌సి ఐవి

రైతుల నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అధికారులను కోరారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళారుల ప్రమేయంతో రైతులు మోసపోతున్నారన్నారు. ఇదే వేదికపై రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఇదివరకే చెప్పామన్నారు. రైతులకు సంచులు, రవాణా ఛార్జీలు కూడా ఇవ్వడం లేదన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అయిన అల్లూరి, తూర్పు గోదావరి జిల్లాల నుంచి అధికారులు రాలేదని జెడ్‌పిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేయగా ఎందుకు బదులు ఇవ్వలేదని, ఆ రెండు జిల్లాలకు సంబంధించిన వివరాలు నివేదికలో ఎందుకు పొందుపరచలేదని అధికారులను ప్రశ్నించారు.

'జగనన్న బడుగు వికాసం'తో ఉపాధి

ప్రజాశక్తి -రావులపాలెం

జగనన్న బడుగు వికాసం పథకంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని విప్, కొత్తపేట ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బస్ స్టాండ్ వద్ద ఆప్కాబ్ డైరెక్టర్ కప్పల శ్రీధర్ భార్య స్వరూపా రాణికి జగనన్న బడుగు వికాసం పథకంతో మంజూరైన నాలుగు బస్సులను జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రూ.14కోట్ల40 లక్షలతో రావులపాలెంకు 29 బస్సులు మంజూరయ్యాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు జీవనోపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో జగనన్న బడుగు వికాశం ద్వారా వారికి బస్సులు అందజేసి వాటిని ఆర్‌టిసి అద్దెకు తీసుకోవడం వారి జీవితాల్లో వెలుగులు నింపడం జరుగుతోందన్నారు. ఈ బస్సులను ప్రారంభించిన జగ్గిరెడ్డి ప్రభుత్వ ఖజానాల వరకు స్వయంగా బస్సు నడిపారు. కార్యక్రమంలో రావులపాలెం, కొత్తపేట ఎంపిపిలు కర్రి లక్ష్మీ వీరెడ్డి, మార్గాని గంగాధరరావు, జెడ్‌పిటిసి సభ్యులు కుడిపూడి శ్రీనివాస్, గుడపాటి రమాదేవి ప్రవీణ్ కుమార్, రావులపాలెం సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, రావులపాలెం ఎంపిడిఒ జి.రాజేంద్ర ప్రసాద్, డిపో మేనేజర్ కెడిఎమ్ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో బస్సులు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

పారదర్శకంగా ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.ముక్కంటి అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర అధికారులకు మంగళవారం ఆయన కార్యాలయంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ, గోనె సంచుల సరఫరా, ఆర్‌బీకేలతో రైస్ మిల్లుల అనుసంధానం, బ్యాంకు గ్యారంటీలు, రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వ్యవసాయ సహాయ సంచాలకులు కాకి నాగేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారిని సోమిరెడ్డి లక్ష్మీ లావణ్యలతో కలిసి మండలంలోని జొన్నాడ ఆర్‌బికె కార్యాలయంలో కాన్ఫరెన్సు తిలకించారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ధాన్యాన్ని అమ్ముకున్న రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత సోమవారం నుంచే ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రారంభించామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని గ్రామ వ్యవసాయ సహాయకులను, వాలంటరీలను ఆదేశించారు. ప్రతిరోజు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు సక్రమంగా చరవాణి యాప్‌లో నమోదు చేయాలన్నారు. వచ్చే నాలుగైదు వారాలు చాలా కీలకమని,రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు అవసరమైన వాహనాలు కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల సివిల్ సప్లై అధికారి సుబ్బరాజు, అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి ప్రతాప్ రెడ్డి, సొసైటీ సిఇఒ రత్తయ్య, విఆర్‌ఒలు స్వామీజీ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఆర్‌డిఒ ముక్కంటి, అధికారులు



అయినవిల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

అయినవిల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు మంగళవారం అయినవిల్లి మండలం అయినవిల్లి సిద్ధి వినాయక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ధాన్యము కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శోభ, సొసైటీ ఛైర్మన్ నంబూరి రాంబాబు రాజు, జెడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొంతు రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ లు కాకర శ్రీనివాస్, బొక్క కామేశ్వరరావు, కాశి వి.వి. సత్యనారాయణ, నాయకులు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి -రామచంద్రపురం

బాలల హక్కులపరిరక్షణకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని రామచంద్రాపురం ఆర్‌డిఒ సింధు పిలుపునిచ్చారు. ప్రజా అవగాహన చైతన్య వారోత్సవాల్లో భాగంగా రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డివిజన్ స్థాయి ఐసిడిఎస్ రివ్యూ నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలు మేరకు బాల బాలికల పరిరక్షణకై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి వారి హక్కులకై కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ఐసిడిఎస్, పోలీస్, లేబర్, రెవెన్యూ, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ముందుకు రావాలని కోరారు. బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం ఆడపిల్లకు 18 ఏళ్ల వయసు నిండిన తరువాతే వివాహం చేయాలని లేకుంటే చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు పాల్పడిన వారిపై గరిష్ఠంగా 2 ఏళ్ళ జైలు శిక్ష , రూ.లక్ష జరిమానా లేదా రెండు విధించబడతాయని తెలిపారు. 2016 నుంచి 2022 వరకు రామచంద్రపురం డివిజన్లో 44 బాల్య వివాహాలను గుర్తించి వాటిని నిలిపివేయడం జరిగిందన్నారు. వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న, ప్రోత్సహించిన వారి పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ లో 16 మంది చైల్డ్ లేబర్స్‌ని, అలాగే భిక్షాటన చేస్తున్న ఇద్దరిని గుర్తించడం జరిగిందన్నారు. వీరిని ఐసిడిఎస్ పరిరక్షణలో ఉంచామన్నారు. కార్యక్రమంలో టి.ఆదిలక్ష్మి, సిహెచ్ వెంకట్రావు, చైల్డ్ లేబర్ కోఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు, కపిలేశ్వరపురం, రాయవరం సిడిపిఒలు, తహశీల్దార్‌లు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సింధు



పనులను పర్యవేక్షిస్తున్న వైసిపి నేతలు

పుంత రోడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఆలమూరు

బడుగువానిలంక నుంచి లంక పొలాలకు వెళ్లే పుంత రోడ్లు సుమారు 6 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టామని స్థానిక సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, ఆమె భర్త వైసిపి నేత దూలం సత్తిబాబు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ గోదావరి వరదలకు ఆ రోడ్లు అన్ని కోతకు గురయ్యాయని అన్నారు. ఈ గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు నాలుగువేల ఎకరాల పంట భూమి ఉండడంతో రైతులందరూ ఈ పుంత రోడ్డు ద్వారానే తమ పొలాలకు వెళ్ళవలసి ఉందన్నారు. రైతుల సమస్య పరిష్కరించేందుకు పుంత రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీంతో కార్యదర్శి యు.సుప్రియ, వైస్ సర్పంచ్ పినమాల జ్యోతి, వైసిపి నాయకులు పినమాల తాతాజీ, వీరా రాజు, కటారి గంగరాజు, వారా శ్రీధర్ పర్యవేక్షణలో గుంతలను పూడుస్తూ తుప్పలను తొలగించే ప్రక్రియ చేపట్టారు.

అసంపూర్తిగా పశువైద్యశాల నిర్మాణం

ప్రజాశక్తి -మండపేట

మండలంలోని వెలగతోడులో గ్రామీణ పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో ఆ భవనం చెంతనే అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నాబార్డ్ నిధులు రూ.26.5 లక్షలతో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. అయితే నేటికీ 75 శాతం పనులు పూర్తిగా గాక మిగిలిన పనులు తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ తదితర నిర్మాణ పనులు చేయాల్సి ఉంది. అయితే పాత భవనంలో వర్షపు నీరు కారుతుండటం కనీస సౌకర్యాలు లేకపోవడంతో పశు వైద్యం కోసం వచ్చే పశు పోషకులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పశు పోషకులు, రైతులు కోరుతున్నారు.



వెలగతోడులో నిర్మాణంలో ఉన్న పశువైద్యశాల

నెల రోజుల్లో పనులు పూర్తిచేస్తాం

ఈ విషయంపై అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖ డిఇ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరగా ప్రస్తుతం 75 శాతం భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని నెల రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు.

-వెలగతోడులోని నూతన పశువైద్యశాల

దంగేటి రాంబాబు అరెస్టుకు డిమాండ్

ప్రజాశక్తి -అమలాపురం

చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి ఎస్‌టి మహిళా ఉద్యోగిని రొడ్డ భవాని మతికి కారకులైన వైసిపి నాయకుడు దంగేటి రాంబాబును అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ భవాని న్యాయ పోరాట సమితి డిమాండ్ చేసింది. స్థానిక కలెక్టరేట్ వద్ద భవాని న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 75వ రోజుకి చేరుకున్నాయి. ప్రజా చైతన్యం టీమ్ అధ్యక్షులు పరమట భీమమహేష్, నామాడి తారక్ మాట్లాడుతూ ప్రధాన నిందితుడు దంగేటి రాంబాబ అరెస్ట్ అయ్యేవరకు భవాని న్యాయపోరాట సమితికి మద్దతుగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు నామాడి శివాజీ, దళిత నాయకులు నామాడి శివాజీ , రవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో పాల్గొన్న ప్రజా చైతన్య టీమ్



కొచ్చిన్‌లో అవార్డు స్వీకరిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం

ఏడిద సర్పంచ్‌కు అవార్డు

ప్రజాశక్తి-మండపేట

పేదరికం లేని స్వయం సమృద్ధి కల్గిన జీవనోపాదుల గ్రామ పంచాయతీ అనే అంశంపై కొచ్చిన్‌లో మంగళవారం జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. ఎపి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున పన్నెండు మంది సభ్యుల బందం ఈ సదస్సులో పాల్గొన్నారు. మండటపేట మండలంలో ఏడిద గ్రామ సర్పంచ్ బురిగ ఆశీర్వాదానికి ఐ ఎఎస్ అధికారి జాఫర్ మాలిక్, కేరళ ప్రిన్సిపల్ సెక్రటరీ మేరీ జోసెఫ్ లు అవార్డు అందజేశారు. ఆశీర్వాదం మీడియాతో మాట్లాడుతూ తమ గ్రామ పంచాయితీలో పేదరికాన్ని నిర్మూలించటానికి చేపట్టిన చర్యలను వివరించారు.



లావణ్యకు సైకిల్ అందజేస్తున్న దాత శ్యామ్, సర్పంచ్ శ్రీనివాసు

విద్యార్థినికి సైకిల్ బహూకరణ

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక శివారు గాంధీనగర్ మండల పరిషత్ పాఠశాల్లో ప్రతిభాపాఠశాలు కనబర్చిన విద్యార్థిని కె.లావణ్యకు దాత బహునూతుల శ్యామ్ సుందర్ మంగళవారం సైకిల్ బహూకరించారు. అలాగే మరో ఐదుగురికి ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టే దాతలైన ప్రతి ఒక్కరినీ అభినందించారు. అలాగే ప్రతి ఒక్కరు కూడా మన గ్రామాన్ని అభివద్ధి పథంలో నడిపించేందుకు సహకారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో పిఎంసి ఛైర్మన్ బొర్రా వీరబాబు, వైసిపి మండల అధ్యక్షులు దొండపాటి వెంకటేశ్వరరావు(బులిరెడ్డి), దొండపాటి చంటి, మోటూరి సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నరసారావు పేటలో హెల్త్ క్లినిక్ ప్రారంభించిన సర్పంచ్ వీరలక్ష్మి

హెల్త్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -రామచంద్రపురం

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ లను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నర్సా పురపు పేట గ్రామ సర్పంచ్ చత్రాది వీరలక్ష్మి అన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతినెల ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ను వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి సందర్శించి రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడంతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న రోగులను వారి ఇంటి వద్ద సందర్శించి వైద్య సేవలు అందిస్తారన్నారు. వైద్యాధికారి డాక్టర్. ఎస్ వి ఆదినారాయణ మాట్లాడుతూ ఈ క్లినిక్ లో రోగులను పరీక్షించి అవసరమైన వారికి 14 రకాల వరకు లాబ్ పరీక్షలు నిర్వహించి 72 రకాల మందులను అందుబాటులో ఉంచామన్నారు. లబ్ధిదారుల జాబితాలను యాప్ లో అప్లోడ్ చేస్తామన్నారు. 68మంది రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో 104 వైద్యాధికారి డాక్టర్ కె.రజిత, ఎంపిటిసి సభ్యురాలు జ్ఞాన లక్ష్మి. సూపర్వైజర్ కమల్ శేషు, ఉప సర్పంచ్ వాసంశెట్టి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకార' సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఈ నెల 21న ముమ్మిడివరంలో జరిగే ప్రపంచ మత్స్యకార దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. ఒఎన్‌జిసి సంస్థ ఇచ్చే నష్ట పరిహారం కోసం లబ్ధిదారుల సన్నద్ధత కార్యక్రమంలో భాగంగా పల్లం, నీళ్లరేవు, చిర్రయానం గ్రామాల్లో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవంతో పాటు వన సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు ఒఎన్‌జిసి నష్ట పరిహారం రెండో విడత పంపిణీ కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ విధానంలో సిఎం జగన్ ప్రారంభిస్తారన్నారు. లబ్ధిదారులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి సభ్యుడు నేల కిషోర్ కుమార్, సర్పంచులు మల్లాడి ఏడుకొండలు, మల్లాడి వీర బాబ్జి, ఓలేటి మంగాదేవి నాగేశ్వరావు, గంటి వెంకట సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



భట్నవిల్లిలో సహకార పతాకాన్ని ఆవిష్కరించిన సొసైటీ చైర్పర్సన్

భట్నవిల్లిలో సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

భట్నవిల్లి గ్రామం వెంకటరామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సహకార వారోత్సవాల సందర్భంగా మంగళవారం డిసిసిబి పాలకవర్గ సభ్యులు, సొసైటీ చైర్ పర్సన్ యిళ్ల సత్య గోపాలకష్ణ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా జెఎల్‌జి గ్రూపులకు రుణాలు ఇచ్చి అన్ని వర్గాల అభ్యున్నతికి కషి చేస్తున్నట్లు తెలిపారు సహకార వారోత్సవాల ఇన్చార్జ్ ఆదిమూలం వెంకటేశ్వరరావు సభ్యులచే సహకార ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ మేనేజర్ విజయ్, సొసైటీ డైరెక్టర్ సలాది కష్ణ, కన్నెపాముల సరస్వతి, సంఘ సిఇఒ దుర్గాప్రసాద్, సొసైటీ సిఇఒలు, ఆర్ బికె చైర్మన్ గుత్తుల అనిల్ కుమార్, సెక్రటరీ కట్ట సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.



చింతలపల్లిలో బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్

హోరాహోరీగా బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి-రాజోలు

స్కూల్ గేమ్ పెడరేషన్ లో భాగంగా చింతలపల్లి జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాక్సింగ్ పోటీల్లో హోరాహోరీగాజరిగాయి.ఈ పోటీలను చింతలపల్లి సర్పంచ్ మట్టా ప్రసన్న కుమారి ప్రారంభించారు.అండర్ 14 విభాగంలో బాలురు, అండర్ ౧-17 విభాగంలో బాల,బాలికలు మొత్తం 150 మంది క్రీడాకారులు ఈపోటీల్లో పాల్గొన్నారని వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో మండల అభివద్ధి అధికారి ఐవి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుల్లెపు వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

'పుల్లెపు' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

సాహితీవేత్త డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని సర్పంచుల సమఖ్య అధ్యక్షులు దంతులూరి వెంకట రాఘవరాజు అన్నారు. మంగళవారం జెడ్‌పి హై స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన సభకు హైస్కూల్ హెచ్ ఎం.వీధి సురేష్ బాబు అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా వివిధ సేవా సంస్థలను స్థాపించారన్నారు. ఇప్పటివరకు 500 అవార్డులను అందించారన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరం మార్కెటింగ్ కమిటీ వైస్ ఛైర్మన్ విత్తనాల శ్రీనివాసరావు, పాఠశాల సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, పాపారావు, ఎం. శ్రీనివాసరావు, జంపా సత్యనారాయణ తదితరులు పాల్గొనారు.

సినీ నటుడు కృష్ణ మృతికి సంతాపం

ప్రజాశక్తి-రామచంద్రపురం

సినీ నటుడు కృష్ణ మృతికి రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. నటుడు కృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. **మండపేట** సినీ నటుడు, రాజకీయ నేత కృష్ణ అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎఐసిసి సభ్యుడు మండపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కామన ప్రభాకరరావు ఒక ప్రకటనలో అన్నారు. **అమలాపురం** నటుడు కృష్ణ మరణానికి చింతిస్తూ అమలాపురం జనసేన పార్టీ నాయకులు స్థానిక గడియార స్తంభం వద్ద ఘన నివాళి అర్పించారు.

కార్టూ'నిజం'





ద్రాక్షారామలో దువ్వూరి సుబ్బమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఘనంగా దువ్వూరి సుబ్బమ్మ జయంతి

ప్రజాశక్తి -రామచంద్రపురం

స్వాతంత్ర్య సమర యోధురాలు, స్వాతం త్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన తొలి ఆంధ్రమహిళ, స్త్రీ జనోద్ధరణకు కషి చేసిన మహిళ దువ్వూరి సుబ్బమ్మ 141 జయంతి ద్రాక్షారామం లో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం బిసి సేన అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దువ్వూరి సుబ్బమ్మ జయంతి నిర్వహించారు. ద్రాక్షారామ లో ఆమె చిత్రపటానికిపూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇటువంటి మహనీయురాలు ద్రాక్షారామలో జన్మించడం నియోజకవర్గానికే గర్వకారణం అని తెలిపారు.. కార్యక్రమంలో కొట్టగల్ల బీమశంకర్, ఏళ్ళమెల్లి రాంబాబు, వీరు బండి, గూటాల భీమ శంకరం, ముద్రగడ శ్రీను, నాయుడు ప్రసాద్, షేక్ మున్నా, మేడి సెట్టి శ్రీనివాస్, చీకట్ల భీమన్న, అల్లం రామకష్ణ పాల్గొన్నారు.

26వ డివిజన్‌లో గడపగడపకూ..

ప్రజాశకి-కాకినాడ

కాకినాడ 26వ డివిజన్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు సంగాని నందం, కామాడి సీత, చవ్వాకుల రాంబాబు, కర్రి శైలజ, బొర్రా రమణ, కొప్పనాతి బాబి పాల్గొన్నారు.

సచివాలయంలో కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ మంగళవారం 34 బి సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ల హాజరును పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న వినతులు, వాటి పరిష్కారాన్ని ఆరా తీశారు. రెవెన్యూ వసూళ్లు, గృహ నిర్మాణం, ఇతర ప్రభుత్వ పథకాల అమలుపై సచివాలయ ఉద్యోగులకు సూచనలిచ్చారు. అనంతరం కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు.

అధికారులను నియమించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

ఉమ్మడి జిల్లా చింతూరు మండలంలో అధికారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చింతూరు మండల ప్రజాప్రతినిధులు మంగళవారం జెడ్‌పి సిఇఒ ఎన్‌వివి.సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతూరు మండలంలో ఎంపిడిఒ, ఒక అటెండర్ తప్ప ఏ అధికారులూ లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు సుధా కాలనీలో రూ.27 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ ఆదినారాయణ రావు, ఎఇ కృష్ణ జీవప్రసాద్, అవార్డు కౌన్సిలర్ కొట్టి పవన్ కిషోర్, సుధా అగ్రో ఎండి రామకృష్ణ, కొట్టి సుధాకర్, మద్దాల చలం, సిద్ధి బాబ్జి, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు బొడ్డు ప్రకాష్, సిద్ధి బాబ్జి, చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంపిపిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఏలేశ్వరం ఎంపిపిపై చర్యలు తీసుకోవాలని ఆ మండల జెడ్‌పిటిసి, 12 మంది ఎంపిటిసిలు, 9 మంది సర్పంచులు మంత్రులు, కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. జెడ్‌పి కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న మంత్రులు వేణు, రాజా, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు ఎంపిపిపై చర్యలు తీసుకోవాలంటూ వినతులు సమర్పించారు.

ధాన్యం కొనుగోలులో సమన్వయం అవసరం

ప్రజాశక్తి-కరప

రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, వాలంటీర్లు అధికారులతో సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని జెసి ఇలాక్కియా ఆదేశించారు. మంగళవారం ఆమె కరప మండలంలో పర్యటించారు. మండలంలోని వేళంగి, సిరిపురం రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. తహశీల్దారు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో కలెక్టర్ దంపతుల పూజలు

ప్రజాశక్తి-సామర్లకోట

స్థానిక కుమార రామ భీమేశ్వర స్వామి వారిని కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, దంపతులు కృతిక శుక్లా, హిమన్షు శుక్లా మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. వీరికి ఆలయ కార్య నిర్వహణాధికారి డి.నాగమల్లేశ్వరరావు, ధర్మకర్తల మండల చైర్మన్ మట్టపల్లి రమేష్ బాబు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

గ్రంథాలయాల్లో పుస్తకావిష్కరణ కార్యక్రమం

ప్రజాశక్తి -యంత్రాంగం

జిల్లాలో 55వ జాతీయ గ్రంథాలయోత్సవాలు ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనం కార్యక్రమాలుజరిగాయి. **మండపేట** స్థానిక ఏడిద రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎం. సత్యవతి తదితరులు మాట్లాడారు. గ్రంథాలయాధికారి ఎన్. బాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** ప్రతి ఒక్కరు పుస్తక పఠనం అలవర్చుకుని విజ్ఞానవంతులు కావాలని గ్రామ సర్పంచ్ శాఖ శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం వెంకట్ రాజు అన్నారు. కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పాలకురాలు డి.శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు, పుస్తకప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొక్క రాంబాబు, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు

ప్రజాశక్తి -అమలాపురం

స్థానిక అంబేద్కర్ భవన్ నందు యువజన సర్వీ సుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు -2022 మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పి.గన్నవరం ఎంఎల్‌ఎ కొండేటి చిట్టిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమా ల వేసి నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు మాట్లాడుతూ 15-29 ఏళ్ల మధ్య వయస్సుగల యువత వివిధ సాంస్కృతిక అంశాలలో జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్‌కు జిల్లాస్థాయిలో 18 ఈవెంట్లకు గాను 399 మం ది, రాష్ట్రస్థాయిలో 16 ఈవెంట్లకు గాను 251 మంది నమోదు చేసు కున్నా రని తెలిపారు. విజేతలను జాతీయస్థాయి పోటీల కు పంపించడం జరుగుతుందన్నా రు. సెట్రాజ్ సిఇఒ డిఎస్‌ఎస్.సునీత తదితరులు ప్రసంగించారు.

పలు చోట్ల వైద్య శిబిరాల ఏర్పాటు

ప్రజాశక్తి -యంత్రాంగం

జిల్లాలో మంగళవారం పలుచోట్ల ఫ్యామిటీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. వివరాలు ఇవి..

ఆలమూరు పేదల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రతి ఒక్కరు తప్పక వినియోగించుకోవాలని ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. చింతలూరులో నూకంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఎజిపి, వైసిపి నేత నామాల శ్రీనివాస్ సహకారంతో జిఎస్‌ఎల్ డెంటల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్, ఎడ్యుకేషన్ సొసైటీ సిఇఒ ఎన్.గోవిందరాజ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సాధారణ ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఎంఎల్‌ఎ విచ్చేసి ప్రారంభించారు. **మండపేట** గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియం చేసుకోవాలని వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఏడిదలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రమళ్ళ బులివీర్రాజు, వైద్యులు ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** గ్రామాల్లో ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. కపిలేశ్వరపురం దేవి సెంటర్ సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో అంగర పిహెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ అనూజ ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలి ఫిజీషియన్ కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. **కొత్తపేట** మిషన్ ఆసియా మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గణేష్ కాలనీ లో మెరియల్ చిల్డ్రన్స్ హోమ్ వద్ద సిడబ్ల్యూఎ మండల ప్రెసిడెంట్ పిఎస్.జయరాజు అధ్యక్షతన మంగళవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అంబాజీపేట కు చెందిన వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది 200 మంది పేద ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

పిఎంసి చైర్మన్‌గా జ్యోతి ఎన్నిక

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

భీమనపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల పిఎంసి చైర్మన్‌గా మంగళవారం సబ్బతి జ్యోతి ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు పిఎంసి చైర్మన్‌గా ఇళ్ల వెంకటలక్ష్మి ఉన్నారు. చైర్మన్ గా ఎన్నికైన జ్యోతిని పలువురు అభినందించారు.

స్థానిక దినపత్రికలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక దినపత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మార్చిన 142 జిఒను సవరించి పబ్లిషర్లు, ఎడిటర్లకు న్యాయం చేయాలని ఎడిటర్స్ అసోషియేషన్ మంగళవారం బిసి సంక్షేమ, సమాచార శాఖ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ముందుగా ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు. అసోసియేషన్ లెటర్‌పాడ్‌ను మంత్రి , కాకినాడ ఎంపీ వంగా గీత, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భ ముగా ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పితాని వెంకట రాము రాష్ట్రంలో స్థానిక దినపత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి వేణు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోనేటి శ్రీనివాస్, పితాని వెంకట రాము, పుర్రె త్రినాథ్, ఎ.జయశ్రీను, పి.వేణుబాబు, ఖండవల్లి సునీల్ కుమార్, మోర్త బాలకుమార్, ఎ.వెంకట రమణ కుమార్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం అభివృద్ధి

ప్రజాశక్తి-సామర్లకోట, పెద్దాపురం, యు.కొత్తపల్లి

ప్రపంచ జ్ఞానమంతా పుస్తకాల్లోనే దాగి ఉన్నందున పుస్తక పఠనంతో జ్ఞానం అభివృద్ధి చెందుతుంది అని గ్రందాలయాధికారి బందిల రత్నామణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల రెండో రోజు పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని పోటీ పరీక్షలలో పాటు జికె, కరెంట్ అఫైర్స్, ఇతర సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలన్నీ గ్రంథాలయాల్లో అందుబాటులో అన్నందున వాటిని ఉపయోగించు కావాలన్నారు. పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర మాట్లాడారు. ఎంఇఒ సిహెచ్‌వివి. సత్యనారాయణ, పాలంకి నాగరాజు, బల్లమూడి సూర్యనారాయణ మూర్తి, వాసంశెట్టి గంగ పాల్గొన్నారు. యు.కొత్తపల్లి ఉప్పాడలో మంగళవారం రెండో రోజు ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి టి.నళిని ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తకాలు చదివితే విజ్ఞానం పెంపొందించేందుకు దోహద పడుతుందని చెప్పారు.

పట్టాభి ఆగ్రో ఫ్యాక్టరీ వద్ద కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వాలు తిమ్మాపురం రహదారిలోని పట్టాభి అగ్రో ఫుడ్స్ పరిశ్రమలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 14 సంవత్సరాలుగా పరిశ్రమలో పనిచేస్తున్న తమను పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయమన్నందుకు విధుల నుండి తొలగించారన్నారు. ఆరు నెలలుగా కార్మికుల కుటుంబాలు ఎన్నో అవస్థలు పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో దేవాబత్తుల రమేష్, గోళ్ల బాలరాజు, కందా శివ, కొండేటి జాన్, యోహాన్ రాజు, పెంకే శ్రీను, ఎం.విష్ణు, సిఐటియు నాయకులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతికుమార్, కె.అప్పన్న, ఆర్.వీర్రాజు, డి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీనుకు జ్యోతుల నెహ్రూ పరామర్శ

గండేపల్లి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఎన్‌టి.రాజాపురానికి చెందిన టిడిపి నాయకుడు కానుకోనుల శ్రీనును జ్యోతుల నెహ్రూ రాజమహేంద్రవరంలోని సాయి ఆసుపత్రిలో మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, కంటిపూడి సత్తిబాబు, కానుకొనల వాసు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం సేకరణకు చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు రైస్ మిల్లర్లు కృషి చేయాలని జెసి ఇలాక్కియా రైస్ మిల్లర్లను కోరారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం జెసి ఎస్.ఇలాక్కియా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైసు మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా చేపడుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సమర్పించాల్సిన బ్యాంకు గ్యారంటీలను సకాలంలో చెల్లించాలని కోరారు. ధాన్యం సేకరణలో అవసరమైన గోనె సంచులను రైతు భరోసా కేంద్రాలకు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో క్షేత్రస్థాయిలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను జెసి రైస్ మిల్లుల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.


సూర్యారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది తదితరులు

తహశీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల తహశీల్దార్‌గా కొమరం సూర్యారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన తహశీల్దార్ పి.చిన్నారావు రాజమహేంద్రవరం కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. తహశీల్దార్ కె.సూర్యారావును డిటి బాలాజీ, ఆర్‌ఐ సంధ్య, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మానసిక ఉల్లాసానికి క్రీడల దోహదం

ప్రజాశక్తి -రావులపాలెం

శరీర దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అమలాపురంలో జరగబోయే జగనన్న క్రీడా సంబరాల ఆటల పోటీలకు కొత్తపేట నియోజకవర్గం నుంచి సీనియర్ విభాగంలో పురుషుల, మహిళల కబడ్డీ, వాలీబాల్ టీం, పురుషుల క్రికెట్ టీం ఎంపికను మంగళవారం రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆయన ప్రారంభించారు.

కుష్టు నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

జాతీయ కుష్టు నిర్మూలన కోసం అవగాహన ర్యాలీ మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పిహెచ్‌సిల పరిధిలో మంగళవారం వైద్యులు ఎమ్.సుమలత, ఆర్.సుదర్శన్ బాబు, పి.భవాని శంకర్, డి.సువచ్చల నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కుష్టు వ్యాధి లక్షణాలపై వివరించారు. హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎవివి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన బస్సు

17 గొర్రెలు మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

గొర్రెల మందపైకి ఒక పరిశ్రమకు చెందిన బస్సు మంగళవారం దూసుకువెళ్లింది. ఈ ఘటనలో 17 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. ఆరుగురికి గాయాలయ్యాయి. వివరాలివి.. సామర్లకోట మండలం అచ్చంపేట ఎడిబి రోడ్డులో ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపాన కొప్పవరం సమీపంలో రోడ్డు పక్కన వెళ్తున్న గొర్రెల మంద పైకి పనసపాడులోని అపెక్స్‌రొయ్యల పరిశ్రమకు చెందిన బస్సు దూసుకు వెళ్లింది. బస్సు రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ఘటన లో 17 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 12 గొర్రెలు గాయపడ్డాయి. బస్సు బోల్తా పడడంతో బస్సులో విధుల నిర్వహణకు వెళుతున్న ఆరుగురు కార్మికులు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల మేర నష్ట పోయినట్లు గొర్రెల యజమాని అప్పన్న వాపోయారు. ప్రమాద స్థలానికి తిమ్మాపురం పోలీసులు చేరుకుని నమోదు చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం గొర్రెల యజమానికి రూ.2లక్షలు నష్టపరిహారం చెల్లించేలా ఒప్పందం కుదుర్చు కున్నట్లు తెలిసింది.

'వైసిపి ప్రభుత్వంలో ఎంబిసిలకు గుర్తింపు లేదు'

ప్రజాశక్తి-అయినవిల్లి

వైసిపి ప్రభుత్వంలో ఎంబిసిలకు గుర్తింపు లేదని, బతుకుదెరువు లేక ఆర్థిక ఇబ్బందులలో వున్నారని రాష్ట్ర బిసి సాధికార సమితి ఎంబీసీ కన్వీనర్ పెంద్రరమేష్ అన్నారు. మచిలీపట్నంలో టిడిపి కార్యాలయంలో రాష్ట్ర బిసి ఫెడరేషన్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర మంగళవారం ఆ పార్టీ ఎంబీసీ సాధికారత సమితి భేటీ జరిగింది. రవీంద్ర మాట్లాడుతూ జిల్లా కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇచ్చిన బాధ్యతలను క్రమశిక్షణతో పూర్తి చేయాలన్నారు. పెంద్రరమేష్ మాట్లాడుతూ జిల్లా కమిటీలను త్వరితగతిన పూర్తి చేస్తామని,అందుకు అందరి సహకారం కావాలని ఆకాంక్షించారు. ఎంబీసీ లకు చంద్రబాబు హయాంలోనే న్యాయం జరిగిందన్నారు.

150 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి -కాట్రేనికోన

మండల పరిధిలోని పల్లంకుర్రు శివారు గొల్లగరువులో 150 నాన్ డ్యూటి పెయిడ్ మద్యం సీసాలను కాట్రేనికోన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గొల్లగరువులో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో మంగళవారం రాత్రి ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో నేరేడుమిల్లి సత్యనారాయణ ను అదుపులో తీసుకుని 150 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మద్యం సరఫరా చేసిన బలుసుతిప్పకు చెందిన వ్యక్తి పరారీలో ఉన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాట్రేనికోన టి.శ్రీనివాస్ తెలిపారు

అన్నదానంలో పాల్గొన్న నవీన్

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడు ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం నిత్యాన్నదానంలో టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. ఈ అన్నదానానికి సరిపడా గ్యాస్‌ను పార్టీ ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అడబాల భాస్కరరావు, అన్నదానం ట్రస్ట్ చైర్మన్ జె.రాంబాబు, అడబాల సత్యనారాయణ, కంటిపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

18న పెదపూడి మండల సమావేశం

ప్రజాశక్తి-పెదపూడి

ఈ నెల 18న పెదపూడి మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించిస్తున్నట్లు ఎంపిడిఒ పోకల విజయభాస్కర్ తెలిపారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. అనపర్తి ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా, ఎంపిపిగా కేతా తులసి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.



ఎన్నికైన సభ్యులు

భవన కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సిఐటియు అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రత్తిపాడు కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సీరం సత్తిబాబు, బొజ్జా సురేష్, ఉపాధ్యక్షులుగా కొప్పుశెట్టి లోవరాజు, మర్రి గోవింద్ కోశాధికారిగా గడ్డం సతీష్, సహాయ కార్యదర్శులుగా పిల్లా శ్రీను, రాంబాబులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, దారి మళ్లించిన నిధులను వెంటనే బోర్డుకి జమ చేయాలని, పెండింగ్ క్లెయిములను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

10 కాసుల బంగారం చోరీ

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తుపాకుల గూడెంలో ఒక ఇంట్లో ఎవరూ లేని సమయంలో 10 కాసుల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఎస్‌ఐ కెవి.రమణ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శీలబోయిన మురళీకృష్ణ ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటున్నారు. అతని సోదరుడు కూడా హైదరాబాదులోనే ఉంటున్నాడు. తల్లి గ్రామంలోని ఇంట్లోనే ఉంటోంది. ఇటీవల ఆమె వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేరన్న విషయాన్ని తెలుసుకున్న దుండగులు ఇంట్లో చొరబడి పది కాసుల బంగారు నగలను దోచుకుపోయారు. బాధితుడు మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఇంటిని కొవ్వూరు డిఎస్‌పి సత్యనారాయణవర్మ, సిఐ వైవి.రమణ మంగళవారం పరిశీలించారు.